క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందిస్తున్న మంత్రి, చైర్మన్

ఖమ్మం అర్బన్: నగరంలోని 8వ డివిజన్ గోపాలపురంకు చెందిన సూరారపు పూజిత ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. అభ్యాసన పాఠశాల చైర్మన్ గొల్లపుడి రాంప్రసాద్ అందించిన రూ.1.25లక్షల ఫీజును మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విద్యార్థినికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా గొల్లపుడి రాంప్రసాద్ మాట్లాడుతూ.. మంత్రి ఆదేశాల మేరకు గతేడాది ప్రథమ సంవత్సరం ఫీజును అందించగా.. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం ఫీజును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన పార్టీలను ఓడించాలి

తిరుమలాయపాలెం: నిరుద్యోగ యువతను, విద్యార్థులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎన్‌డీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన రాజారంలో జరిగిన విప్లవ విద్యార్థి ఉద్యమ అమరవీరుడు శ్రీపాద శ్రీహరి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్ రామకృష్ణ, యువతేజ్, సంపత్, ఎన్‌డీ నాయకులు మల్సూర్, వీరస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణవేణి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన వనం కృష్ణవేణికి ఫరీదాబాద్ మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ శుక్రవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఖమ్మంలో తాను చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి కృష్ణవేణి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా హోమియో ఆస్పత్రి నిర్మాణానికి పాటుపడ్డారు. దీంతో ఆమెకు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అందజేశారు.

నిర్భయంగా ఓటేయండి..



గువ్వలగూడెంలో మాట్లాడుతున్న ఏసీపీ

నేలకొండపల్లి: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన గువ్వలగూడెంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నూరుశాతం పోలింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ జితేందర్, నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి విజయానికి కృషి చేద్దాం..

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపునకు యాదవులు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కూసుమంచిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ వెనిక జానకిరామయ్య, యాదవ సంఘ నాయకులు వెంకటరమణ, శ్రీనివాస్, లచ్చయ్య, వీరభద్రం, శ్రీను, భూషయ్య, లింగయ్య, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

నేలకొండపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్వీర్యమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎన్నుకున్న కమిటీలో అధ్యక్ష, కార్యదర్శులుగా గణేశ్, పవన్, గర్ల్స్ కమిటీ కన్వీనర్‌గా ప్రసన్నతో పాటు మరో 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్, నాగరాజు, మహేశ్, యాకోబ్, డేవిడ్, స్వాతి, రేష్మ, ప్రవల్లిక, మౌలానా, శిరీష, పావని తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో 3.. పాలేరులో 2..



ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు



ఖమ్మం స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కొంకిమళ్ల సాయికుమార్



ఎన్నికల నిబంధనలు పాటిస్తానని ప్రమాణం చేస్తున్న పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి శైలజ

పటిష్ట బందోబస్తు నడుమ నామినేషన్ల స్వీకరణ

- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నామినేషన్ దాఖలు
- అభ్యర్థితో పాటు నలుగురికి అనుమతి ఇచ్చిన అధికారులు
- ఆంక్షలతో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు–2023కు సంబంధించి నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కావడంతో అధికారులు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఖమ్మం శాసనసభ స్థానానికి సంబంధించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కేఎంసీలో ఏర్పాటు చేయగా.. తొలిరోజు ఖమ్మం నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరఫున తుమ్మల నాగేశ్వరరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున కాటేపల్లి శైలజ, స్వతంత్ర్య అభ్యర్థిగా కొంకిమళ్ల సాయికుమార్‌లు ఖమ్మం–112 రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు 15 మంది నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ కార్యాలయం నుంచి తీసుకెళ్లారు.

బందోబస్తుతో ప్రజల అవస్థలు..

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో పోలీసులు ఆర్‌ఓ కార్యాలయానికి నలువైపులా వంద మీటర్ల దూరంలో రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులతో పాటు వారికి ష్యూరిటీగా వచ్చినవారి ఆధార్ కార్డు వివరాలను సరి చూసుకుని కార్యాలయంలోకి పోలీసులు అనుమతించారు. కాగా, పోలీస్ బందోబస్తుతో అటుగా వెళ్లే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు.

పాలేరులో ఇద్దరు..

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలో తొలిరోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి, ఇండిపెండెంట్‌గా ఖమ్మంరూరల్ మండలం సత్యనారాయణపురంకు చెందిన ఎదురుగట్ల చిట్టిమల్లు, ఆమ్‌ఆద్మీ పార్టీ నుంచి నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీను నామినేషన్లు దాఖలు చేశారు. వీరిద్దరు తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాజేశ్వరికి అందించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి పసుమర్తి శ్రీను

కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం

ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్ / ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో ఖమ్మం అర్బన్ గ్రామీణ వైద్యులు, 50వ డివిజన్, తెలంగాణ సిటిజన్ ఫోరం (టీసీఎఫ్)ల ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులు విస్తృతస్థాయిలో సంబంధాలు కలిగి ఉంటారని, ఆర్‌ఎంపీలు తలచుకుంటే తన మెజార్టీ మరింత పెరుగుతుందన్నారు. అదేవిధంగా ఉద్యోగులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, సమన్వయకర్త జోషిబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు బాలబోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వీరాచారి, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. అలాగే ఖిల్లా, బీకే బజార్‌లలో ఉన్న మసీదుల్లో జుమా నమాజ్‌కు హాజరుకాగా ముస్తఫా, ఖాదర్‌బాబా, పాషా, చోటేబాబా, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నామినేషన్ వేసిన తుమ్మలను ఏపీఎస్‌ఐడీసీ మాజీ డైరెక్టర్, రైతు ఆత్మహత్యల నివారణ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జంజిరాల రాజేశ్ సత్కరించారు.



రఘునాథపాలెం: ఎంపీటీసీ సుజాతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుమ్మల

కాంగ్రెస్‌లో చేరిక..

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక, రేగులచలక గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కోయచలక ఎంపీటీసీ బలుసుపాటి సుజాతతో పాటు నాయకులు యండపల్లి సత్యం, యండపల్లి జగన్మోహన్‌రావు, చెరుకూరి పూర్ణచంద్రరావు తదితరులు పార్టీలో చేరారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌రెడ్డి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: పేదల సొంతింటి కల రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి తిరుమలాయపాలెం మండలంలో ముజాహిదిపురం గ్రామంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు రామ సహాయం, నరేశ్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, సర్పంచ్ యాకమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు వద్ద ఉన్న పలు రైస్ మిల్లులకు చెందిన హమాలీలు 70 కుటుంబాలు ప్రసాద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, నాయకులు శాఖమూరి రమేశ్, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, మైశా శంకర్, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు పెద్దపీట..

ఇల్లెందు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాయక్

కామేపల్లి: ఎన్నో ఆశలతో సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ పాలనలో దగా పడిందని, అందుకు కాంగ్రెస్ పార్టీ సహకారం అందించడంతో రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకున్నాడని ఇల్లెందు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధరావత్ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ బీసీలకు పెద్దపీట వేస్తూ బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రి చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుట్రలకు తెరలేపారన్నారు. ఎన్ని అడ్డంకులు, అవరోధాలు సృష్టించినా రానున్నది బీజేపీ ప్రభుత్వమే అన్నారు . బీజేపీ మండల అధ్యక్షుడు జర్పుల రామారావు, నియోజకవర్గ కన్వీనర్ బాలగాని గోపికృష్ణ, జిల్లా సమన్వయకర్త నాళ్ల సోమసుందర్, జిల్లా నాయకులు భాగం రంగారావు, భూక్యా శ్రీనునాయక్, జాలే శ్రీను, వేముల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రవీంద్రనాయక్

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లికి చెందిన రేషన్ డీలర్ సత్యనారాయణ అధికార పార్టీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొంటున్నారని పలువురు పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అలాగే, ఆయన బీఆర్‌ఎస్ ప్రచారంలో పాల్గొన్నట్లు ఓ వీడియోను శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయమై సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి పుట్టిన రోజులో పాల్గొన్న వీడియోను వైరల్ చేస్తూ ఫిర్యాదు చేశారే తప్ప తాను ప్రచారానికి హాజరు కావాలని తెలిపారు.

'ఎస్‌బీఐటీ'లో అవగాహన..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో టాస్క్ శిక్షణా సంస్థ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.బాలు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో వృద్ధి చెందాలంటే భాషలపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం శిక్షకుడిని సన్మానించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, జి.ప్రవీణ్‌కుమార్, శివప్రసాద్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారం

కామేపల్లి: మండలంలో ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ శనివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. మండలంలోని కొత్తలింగాల, గోవింద్రాల, పాన్నేకల్, బర్లగూడెం, గరిడేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు.

9న సీపీఎం అభ్యర్థి నామినేషన్..

తిరుమలాయపాలెం: పాలేరు సీపీఎం అభ్యర్థి నామినేషన్ ఈ నెల 9న జరుగుతుందని పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీపీఎం ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు పద్మనాభుల సుధాకర్, గ్రామ శాఖ కార్యదర్శి పప్పుల ఉపేందర్, నాగటి సురేశ్, దొండేటి నిర్మలరావు, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, రామనబోయిన రవి, పిట్టల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కామేపల్లి: మేజర్లమైన తాము వివాహం చేసుకున్నామని, కుటుంబీకుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ జంట కామేపల్లి పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. ఊట్కూర్ గ్రామానికి చెందిన నాగెల్లి రవితేజ, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరుకు చెందిన మంద సుష్మిత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ మేజర్లు కావడమే కాక ఒకే కులస్తులైనా వివాహానికి యువతి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో మూడు రోజుల కిందట రహస్యంగా వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులను ఆశ్రయింగా, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఇద్దరి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కృష్ణారావు, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల ప్రచార కరపత్రాలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ కే.వీ.కృష్ణారావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో కాంగ్రెస్ మాత్రమే ఉద్యమకారులపై చిత్తశుద్ధి ప్రదర్శించిందని చెప్పారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల స్థలం ఇవ్వనున్నట్లు ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీకి కృతజ్ఞతలుగా కాంగ్రెస్‌ను గెలిపించాలని ఉద్యమకారులు ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఫోరమ్ బాధ్యులు బచ్చల పద్మాచారి, షేక్ మస్తాన్, కామా ప్రభాకర్, నర్సింహారావు, నాగుల్‌మీరా, సాయి పాల్గొన్నారు.

నీచరాజకీయాలు చేయొద్దు..

ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఏ రాజకీయ నాయకుడైనా తన స్వార్థం కోసం నీజమైన రాజకీయాలు చేయొద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని 24వ డివిజన్ శాంతినగర్‌లో మాజీ ప్రభుత్వ ఉద్యోగి నరసింహారావు, ఆయన కుమార్తె నిరోషా ఆధ్వర్యంలో, 27వ డివిజన్‌లో ఆర్యవైశ్య చిరువ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, 53వ డివిజన్‌లో వైద్యుడు నియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో పువ్వాడ మాట్లాడారు. తుమ్మల తన స్వార్థం కోసం బీగ్‌ను పావుగా వాడుకొని ఆయన రాజకీయ జీవితాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. తాను చేసిన అభివృద్ధిని కూడా తుమ్మలే చేసినట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ప్రజలకు ఏమి చేశారని, చేసి ఉంటే ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారని తుమ్మలను మంత్రి ప్రశ్నించారు. 40 ఏళ్ల పాటు ఏ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా చేశారో అదే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నాడని, ఇదేనా మీరు చెప్పే నీతి, నిజాయితీ అని అన్నారు. అనంతరం 42వ డివిజన్ మజీద్-ఏ-మక్కా మజీద్‌లో మంత్రి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు పగడాల శ్రీవిద్య నాగరాజు, మగ్బూల్, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, షౌకత్ అలీ, తాజ్ ఉద్దీన్, బిచ్చాల తిరుమలరావు, మద్దినేని వెంకటరమణ, డొకుపర్తి సుబ్బరావు, జగ్గారావు, సలీం తదితరులు పాల్గొన్నారు.



24వ డివిజన్‌లో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కందాళ విజయమ్మ ఇంటింటి ప్రచారం..

ఖమ్మంరూరల్: కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి విజయమ్మ, కుమార్తె దీప్తి శుక్రవారం మండలంలోని సాయిగణేశ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కందాళ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో అందించిన సేవా కార్యక్రమాలు, ఆపదలో ఉన్న వారికి చేసిన సాయాలు ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందాళ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

కూసుమంచి: ఎన్నికల ప్రచారాల్లో భాగంగా పాలేరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో పలువురు వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె.యాకుబ్‌పాషా, నాయకుడు శ్రీకాంత్, బోడియాతండాకు చెందిన వార్డు సభ్యులు భూక్యా రవి, బదావత్ బాన్‌సింగ్, సీపీఎం, టీడీపీ నాయకులు భూక్యా మచ్చా, ఆంగోత్ హనుమా, వెంకన్నతో పాటు మరో 22 కుటుంబాలు, గోరీలపాడుతండాకు చెందిన 150 మంది కందాళ సమక్షంలో పార్టీలో చేరారు.



సాయిగణేష్‌నగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న దీప్తి

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ మీటింగ్ కోసం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలోని స్టేజ్‌ను ధ్వంసం చేసిన బీఆర్‌ఎస్ నాయకులతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్‌ను కోరారు. శుక్రవారం పీడీఎస్‌యూ నేతలు కళాశాల మైదానంలోని ధ్వంసం చేసిన స్టేజ్ ప్రాంతాన్ని సందర్శించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంఘ నాయకులు వినయ్, సురేశ్, సతీశ్, శివ, శరత్, విష్ణు, శ్రీరామ్, నవ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పడ్డాక రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఆశించిన ఫలితాలు రాకున్నా, సీఎం కేసీఆర్ జిల్లా అభివృద్ధికి వేల కోట్ల నిధులు ఇచ్చారని ఆ పార్టీ జిల్లా ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరగగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమన్వయ కర్తలుగా తమను నియమించిన సీఎం కేసీఆర్, మంత్రులు, కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఖమ్మం అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.3,500 కోట్లు నిధులు ఇవ్వగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రజలకు అవసరమైన మౌళిక వసతులుకల్పించారని చెప్పారు. కాగా, ఖమ్మంలో ఆదివారం జరిగే సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను విజయవంతం చేయడంతో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. సభ్యులు పులిపాటి ప్రసాద్, చింతనిప్పు కృష్ణ చైతన్య, డోకుపర్తి సుబ్బారావు, ఆకుల మూర్తి, పల్లా రాజశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకే నిధులు వెచ్చించాం...

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలో తన భార్య ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌కు రూ.13కోట్ల నిధులు ఇచ్చినట్లు చెబుతున్నారని... ఆ నిధులను అభివృద్ధి పనులకు వెచ్చించానే తప్ప దుర్వినియోగం చేయలేదని కాంగ్రెస్ నాయకుడు, కార్పొరేటర్ చావా మాధురి భర్త నారాయణరావు తెలిపారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థితుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్పొరేటర్ పాకాలపాటి విజయలక్ష్మి, నాయకులు మిక్కిలినేని నరేందర్, పోట్ల వీరేందర్, రావూరి సైదుబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి, తాను కష్టపడి ఆస్తులు సంపాదించామే కానీ కబ్జా చేయలేదన్నారు. ఇక తనను వలస వాది అంటున్న వారు కూడా వలస వచ్చిన వారేనని గుర్తించాలని సూచించారు. నాయకుడు నరేందర్ మాట్లాడుతూ పీజీ కళాశాల మైదానంలో స్టేజీని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరమ్మతు చేయించారనే నెపంతో కూల్చడం నేరమని పేర్కొన్నారు.

బీఎస్పీ అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రమణగుట్టలో నిర్వహించిన బీఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో జనరల్ స్థానాల్లో ఇప్పటికే పాలేరు సీటు బీసీలకు కేటాయించగా.. ఖమ్మం జనరల్ స్థానం కూడా బీసీలకే కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు, జిల్లా కార్యదర్శి పల్లెపొంగు విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సుభాష్‌చంద్రబోస్, బచ్చలకూరి బాలరాజు, ఖమ్మం అసెంబ్లీ అధ్యక్షుడు మట్టే నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ నాయకుడు జిన్నేక రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తున్న పార్టీలపై నిఘా పెట్టాలి..



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: గత కొన్ని రోజులుగా ఖమ్మంలో ఇతర పార్టీల నాయకులను, కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ పార్టీలోకి చేర్చుకుంటున్న వారిపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగంగానే పలు పార్టీల నాయకులు బేరమాడుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఖమ్మం మార్కెట్ వద్ద పెట్టిన చెక్‌పోస్టును ఎత్తివేయాలన్నారు. ఇక తమ కార్పొరేటర్లు తెలియక బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నందుకు వివరణ కోరినట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, నాయకులు ఎస్.నవీన్‌రెడ్డి, యర్రా శ్రీను, భూక్యా శ్రీను పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన ప్రైవేట్ ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌ను ప్రైవేట్ ఉద్యోగుల సంఘం బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రైవేట్ ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడిగా కొనసాగాలని అఫ్జల్‌హసన్ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ మారేపల్లి వెంకట్, సతీశ్, కోటి తదితరులు కోరారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ప్రైవేట్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌లో అఫ్జల్‌హసన్ పేరును ముద్రించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకులు రెహ్మాన్, నరేందర్ గౌడ్, ప్రవీణ్, రామకృష్ణ, అశోక్, నారాయణ, పవన్, హరి పాల్గొన్నారు.